TELTEL12349

# మన సాక్షి
గొంతుక

తెలుగు దినపత్రిక
ఎడిటర్: గుండ రాజు
చీఫ్ ఎడిటర్: చింతల మధుకృష్ణ




తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ | సంపుటి : 1 సంచిక : 80 10- 6 - 2024 సోమవారం | పేజీలు : 6 | వెల.4/-

## వరుసగా మూడోసారి

# ప్రధానిగా మోదీ..



- నెహ్రూ రికార్డుతో సమం
-రాష్ట్రపతి భవన్‌లో వైభవంగా కార్యక్రమం
-మోదీతోపాటు 72 మంది ప్రమాణం
-30 మంది క్యాబినెట్, ఐదుగురు

న్యూఢిల్లీ, జూన్ 9

రాష్ట్రపతి భవన్ ఆవరణలో ఆదివారం సాయంత్రం వేలాదిమంది ఆహుతులు, పలు రంగాలకు చెందిన ప్రముఖులు, పొరుగు దేశాల అధినేతల సమక్షంలో 73 ఏళ్ల నరేంద్రమోదీ భారతదేశ ప్రధానమంత్రిగా వరుసగా మూడోసారి ప్రమాణం చేశారు. తద్వారా దేశ చరిత్రలో ఇప్పటి వరకూ మాజీ ప్రధాని జవహర్‌లాల్‌నెహ్రూకు మాత్రమే సాధ్యమైన రికార్డును సమం చేశారు. మోదీ ప్రమాణ స్వీకారోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. దేశంలోని పలువురు రాజకీయ, వ్యాపార, సినీ ప్రముఖులు, తాజా, మాజీ ముఖ్యమంత్రులు, పీఠాధిపతులు హాజరయ్యారు. ప్రమాణ స్వీకారానికి నరేంద్ర మోదీ పేరును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలవగానే సభా ప్రాంగణమంతా కరతాళ ధ్వనులతో మార్మోగింది. వేదిక ఎదుట ఆసీనులై ఉన్న వేలాది మందిని ఉద్దేశించి మోదీ గౌరవ వందనం చేసి ఆ తర్వాత ప్రమాణ స్వీకారం చేశారు.

అనంతరం 71 మంది మంత్రులు కూడా ప్రమాణం చేశారు. వారితో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణ స్వీకారం చేయించారు. వీరిలో 60 మంది బీజేపీకి చెందినవారు కాగా 11 మంది ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలకు చెందిన వారు. తెలంగాణ నుంచి బీజేపీ ఎంపీలు కిషన్‌రెడ్డి క్యాబినెట్ మంత్రిగా, బండి సంజయ్ సహాయమంత్రిగా, ఆంధ్రప్రదేశ్ నుంచి తెలుగుదేశం ఎంపీలు కింజరాపు రామ్మోహన్ నాయుడు కేబినెట్ మంత్రిగా, పెమ్మసాని చంద్రశేఖర్ సహాయమంత్రిగా, బీజేపీ ఎంపీ శ్రీనివాస వర్మ సహాయమంత్రిగా ప్రమాణం చేశారు. దీంతో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన అయిదుగురికి మోదీ మూడో మంత్రివర్గంలో స్థానం దక్కినట్లయింది.

### 30 మంది క్యాబినెట్ మంత్రులు

మోదీ కొత్త మంత్రివర్గంలో 30మంది క్యాబినెట్ మంత్రులు, అయిదుగురు స్వతంత్ర హోదాలో సహాయమంత్రులు, 36 మంది సహాయమంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో మోదీతో కలిపి కేంద్ర మంత్రివర్గంలో మొత్తం 72 మందికి స్థానం లభించినట్లయ్యింది. కేరళ నుంచి ఎన్నికైన ఏకైక బీజేపీ ఎంపీ, సినీ నటుడు సురేశ్‌గోపీతో పాటు పార్టీలో నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతున్న అదే రాష్ట్రానికి చెందిన క్రైస్తవ నేత కురియన్‌కు పార్లమెంటులో సభ్యత్వం లేనప్పటికీ మంత్రిపదవి ఇచ్చారు. పంజాబ్‌లోని లూథియానా నుంచి ఇటీవలి ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయినప్పటికీ రవీందర్ సింగ్ బిట్టూకు మంత్రి వర్గంలో స్థానం కల్పించారు.

### వీరికి మళ్లీ అవకాశం

మోదీ గత మంత్రివర్గంలో మంత్రులుగా ఉన్న పలువురికి ఈసారి కూడా పదవి లభించింది. వారిలో బీజేపీకి చెందిన రాజ్‌నాథ్‌సింగ్, అమిత్ షా, జయశంకర్, నిర్మలా సీతారామన్, హర్దీప్ సింగ్‌పూరి, పీయూష్ గోయెల్, నితిన్ గడ్కరీ, మన్సుఖ్ మాండవీయ, అశ్వినీ వైష్ణవ్, ధర్మేంద్ర ప్రధాన్, ప్రహ్లాద్ జోషి, గజేంద్రసింగ్ షెఖావత్, భూపేంద్ర యాదవ్, జ్యోతిరాదిత్య సింధియా, కిషన్‌రెడ్డి, గిరిరాజ్‌సింగ్, అన్నపూర్ణాదేవి, కిరెన్ రిజెజు, అర్జున్ రాం మేఘ్వాల్, శోభా కరంద్లాజే, నిత్యానందరాయ్, జితేంద్ర సింగ్, రావు ఇంద్రజిత్ సింగ్, ఎల్.మురుగన్, వీరేంద్రకుమార్, కిషన్ పాల్ గుజ్జర్, ఎస్పీ సింగ్ బఘేల్ ఉన్నారు. వీరితోపాటు అనుప్రియ పటేల్ (అప్నాదళ్), రాందాస్ అథావలే (రిపబ్లికన్ పార్టీ) తదితర మిత్రపక్షాల నేతలకు మళ్లీ మంత్రివర్గంలో అవకాశం లభించింది.



## కిషన్‌రెడ్డికి మళ్లీ కిరీటం..
## కార్పొరేటర్ స్థాయి నుంచి..
## కేంద్ర మంత్రిగా సంజయ్

- 2 రాష్ట్రాల అభివృద్ధికి కృషి: కిషన్‌రెడ్డి
-తెలంగాణ సర్కారుకు పూర్తి సహకారమందిస్తా: బండి

హైదరాబాద్/న్యూఢిల్లీ :
వారిద్దరూ బీజేపీలో అంకితభావం కలిగిన నేతలు. పార్టీ సిద్ధాంతమే ఊపిరిగా, అధినాయకత్వం ఆదేశాలే శిరోధార్యంగా పనిచేస్తూ సమర్థత నిరూపించుకున్న వారిద్దరూ కేంద్ర మంత్రులయ్యారు. ఆ ఇద్దరే... గంగాపురం కిషన్‌రెడ్డి, బండి సంజయ్. సికింద్రాబాద్ నుంచి వరుసగా రెండోసారి విజయం సాధించిన కిషన్‌రెడ్డికి మరోసారి క్యాబినెట్ హోదా లభించగా, కరీంనగర్ నుంచి వరుసగా రెండోసారి గెలుపొందిన బండి సంజయ్‌కి, సహాయ మంత్రిగా అవకాశం వచ్చింది. ఈ ఇద్దరు కూడా గడచిన మూడు దశాబ్దాలుగా పార్టీ అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేస్తూ వస్తున్నారు. ఇందుకు గుర్తింపుగా వారిని మంత్రి పదవులు వరించాయని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. రాష్ట్రానికి సంబంధించి కేంద్ర క్యాబినెట్‌లో ఓసీ, బీసీ సమతుల్యత సాధించినట్లయ్యిందన్న అభిప్రాయం పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

## సులువుగా గ్రూప్-1 ప్రిలిమ్స్!

- గతంతో పోలిస్తే నేరుగా జవాబు ఉన్న ప్రశ్నలు అధికం.. రాష్ట్ర ప్రభుత్వ 6 గ్యారెంటీలపై ప్రశ్నలు
ప్రశాంతంగా ముగిసిన పరీక్ష..
- హాజరైన 3.02 లక్షల మంది అభ్యర్థులు
- అక్టోబరు 21 నుంచి మెయిన్స్..
కరీంనగర్ జిల్లాలో మద్యం సేవించి విధులకు హాజరైన ఉద్యోగి





# కారులో నిద్రిస్తుండగా దొంగల దాడి

**5 తులాల బంగారు ఆభరణాలు చోరీ**



**చిట్యాల, జూన్ 9 :** జాతీయ రహదారి 65 పక్కన కారు నిలిపి విశ్రాంతి తీసుకుంటున్న వారిపై దొంగలు దాడి చేసి బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన ఘటన ఆదివారం తెల్లవారుజామున నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి వద్ద చోటుచేసుకున్నది. ఎస్సై సైదాబాబు కథనం ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లా అమలాపురం మండలం తొట్లపాలెం గ్రామానికి చెందిన పల్లెపు శ్రుతి శనివారం మధ్యాహ్నం 2.30 గంటలకు అన్న పంచాక్షరి, వదిన అఖిల, వారి కుమారుడు దేవాంశ్‌తో కలిసి కారులో హైదరాబాద్‌కు బయల్దేరారు. అర్ధరాత్రి దాటిన తరువాత 2.30 గంటల ప్రాంతంలో చిట్యాల మండలం పెద్దకాపర్తి శివారులో జాతీయ రహదారి పక్కన సర్వీసు రోడ్డుపై కారును నిలిపారు. కారు డోర్లను లాక్ చేసుకొని లోపల నిద్రించారు. తెల్లవారుజామున 3.45 గంటల ప్రాంతంలో టీషర్టులు వేసుకొని, ముఖానికి ముసుగులు ధరించిన ఇద్దరు వ్యక్తులు బండరాయితో కారు అద్దాలు పగులగొట్టారు. కారులో నిద్రిస్తున్న శ్రుతి, పంచాక్షరిలను బయటికి లాగారు. వారిని విచక్షణా రహితంగా కొట్టి శ్రుతి మెడలోని తులం గ్రాముల బంగారు గొలుసు, అఖిల మెడలోని మూడు తులాల బంగారు పుస్తెల తాడు, పంచాక్షరి చేతికి ఉన్న తులం బంగారు ఉంగరాన్ని తీసుకొని పారిపోయారు. శ్రుతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్పీ చందనా దీప్తి ఆదివారం ఉదయం సంఘటనా స్థలాన్ని సందర్శించారు. దొంగలను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.



# దక్షిణాదికి రెడ్ అలర్ట్

**భారీ వర్షాలు కురుస్తాయన్న ఐఎండీ**

- ఏపీ, తెలంగాణకు హెచ్చరిక
- రాగల నాలుగైదు రోజులు జాగ్రత్తగా ఉండాలి
- అరేబియా సముద్రంలో తుపాను ఏర్పడే చాన్స్
- కోస్తాంధ్ర, యానాం, దక్షిణ తెలంగాణకు ఎఫెక్ట్

దక్షిణ భారతదేశం వాతావరణంపై ఐఎండీ రెడ్ అలర్ట్ ప్రకటించింది. ఇప్పటికే నైరుతి రుతు పవనాలు దక్షిణాదిన విస్తరించడంతో రానున్న నాలుగైదు రోజుల్లో కోస్తాంధ్ర, ఉత్తర కర్నాటక, మహారాష్ట్ర ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు ఉంటాయని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. దక్షిణాదిన వాతావరణంలో తీవ్రమైన మార్పులు చోటుచేసుకోనున్నాయి. నైరుతి రుతు పవనాల ప్రభావంతో రాగల నాలుగైదు రోజుల్లో మధ్య అరేబియా సముద్రంలోని కొన్ని ప్రాంతాలు, మహారాష్ట్ర, తెలంగాణ, కోస్తాంధ్ర, దక్షిణ ఛత్తీస్‌గఢ్, దక్షిణ ఒడిశాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావారణ శాఖ అంచనా వేస్తోంది. వాయువ్య మధ్యప్రదేశ్, బీహార్ ప్రాంతాల్లో తుపాను ఏర్పడే అవకాశాలున్నాయి. ఫలితంగా బీహర్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, మధ్యప్రదేశ్, విదర్భ, ఛత్తీస్ గఢ్ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో మోస్తరు వర్షాలు పడనున్నాయి. జూన్ 12 తరువాత బీహార్, జార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో భారీ వర్ష సూచన ఉంది.

### ఏపీ, తెలంగాణకు అలర్ట్..

రానున్న ఐదు రోజుల్లో కోస్తాంధ్ర, యానాం, రాయలసీమ, తెలంగాణ, తమిళనాడు, పుదుచ్చేరి ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు పడవచ్చు. జూన్ 8 నుంచి 11 వరకూ కేరళలో , 8, 9 తేదీల్లో కర్నాటకలో 10వ తేదీన తెలంగాణలో అతి భారీ వర్షాలు పడనున్నాయి. ముఖ్యంగా రానున్న 45 రోజుల్లో కోస్తాంధ్ర, ఉత్తర కర్నాటక ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాల హెచ్చరిక పొంచి ఉంది.

# జేఈఈ అడ్వాన్స్ రిజల్ట్ రిలీజ్

- ర్యాంక్ లిస్ట్ విడుదల చేసిన మద్రాస్ ఐఐటీ
- గణనీయంగా పెరిగిన కటాఫ్ మార్కులు
- ఐఐటీ ఢిల్లీకి ఫస్ట్ ర్యాంక్

జేఈఈ (జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్) అడ్వాన్స్‌డ్ 2024 ఫలితాలు విడుదలయ్యాయి. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) మద్రాస్ ఆదివారం ఉదయం ఫలితాలను ప్రకటించింది. జనరల్ కేటగిరీ అభ్యర్థులకు కనీస కటాఫ్ 93.2 పర్సంటైల్‌గా ఉంది. కాగా కటాఫ్ పర్సంటైల్ 2023లో 90.7, 2022లో 88.4గా ఉండగా ఈసారి అంతకంటే ఎక్కువగా ఉంది.

**టాప్ టెన్ ర్యాంకర్లు వీరే...**

ఐఐటీ ఢిల్లీ జోన్‌కు చెందిన వేద్ లహోటి 360 మార్కులకు 355 సాధించి సీఆర్ఎల్‌లో (కామన్ ర్యాంక్ లిస్ట్) టాపర్‌గా నిలిచాడు. ఇక ఐఐటీ బాంబే జోన్‌కు చెందిన ద్విజా ధర్మేశ్ కుమార్ పటేల్ 360 మార్కులకు 332 సాధించి సీఆర్ఎల్ 7తో టాప్ మహిళా ర్యాంకర్‌గా నిలిచింది. ఈ మేరకు కామన్ ర్యాంక్ లిస్ట్, కేటగిరీ ర్యాంకుల జాబితాను ఐఐటీ మద్రాస్ విడుదల చేసింది. కాగా జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష మే 26, 2024న దేశవ్యాప్తంగా జరిగింది. రెండు సెషన్‌లలో జరిగింది. ఆన్సర్ కీ జూన్ 2న విడుదలవగా.. టాప్ 2.5 లక్షల మంది విద్యార్థులు మాత్రమేజేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారు. ఈఏడాదిజేఈఈ అడ్వాన్స్‌డ్‌కు కటాఫ్ మార్కులు గణనీయంగా పెరిగాయి. కాగా అభ్యర్థులు జేఈఈ ఏడీవీ.ఏసీ.ఇన్ ( jeeadv.ac.in ) వెబ్‌సైట్‌ను సందర్శించి ఫలితాలను చెక్ చేసుకోవచ్చు. పేపర్ 1, పేపర్ 2 రెండింటి స్కోర్ కార్డులను చూడవచ్చు.

# దూసుకొచ్చిన డీసీఎం

- ముగ్గురు సాధువులు మృతి
- వనపర్తి జిల్లాలో ఘటన

వనపర్తి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. సాధువులపై ఓ డీసీఎం దూసుకెళ్లడంతో ముగ్గురు సాధువులు మృతి చెందారు. ఈ విషాదకర సంఘటన వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం రంగాపురం వద్ద జాతీయ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..పెబ్బేరు నుంచి కర్నూలు వైపు గుజరాత్‌కు చెందిన సాధువుల బృందం నడుచుకుంటు వెళ్తున్నది. ఇదే క్రమంలో ఓ డీసీఎం వారిని ఢీ కొట్టడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు చికిత్స పొందుతూ మరణించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# బస్సును ఢీకొన్న బైక్

- మెడికో దుర్మరణం
- కర్నూల్ జిల్లాలో ఘటన

కర్నూల్ నగరంలోని కేఎంసీ మెడికల్ కళాశాల సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మెడికల్ కళాశాల విద్యార్థి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. సత్యసాయి జిల్లా, రోళ్ల మండలం, పిల్లిగుండ్లపల్లి గ్రామానికి చెందిన రంగనాథ్ రెడ్డి కుమారుడు తేజేశ్వర్ రెడ్డి( 22). కర్నూల్ మెడికల్ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం ఉదయం. నందికొట్కూరు డిపోకు చెందిన ఏపి 39 టికే 0088 బస్సు నందికొట్కూరు నుండి కర్నూల్ ఆర్టీసీ బస్టాండ్ కి వెళుతూ. బుధవార్ పేట పెట్రోల్ బంక్ సమీపంలో బస్సుకంటే వేగంగా బైక్‌పై వెళుతూ బస్సును ఢీకొన్నాడు.

దీంతో తలకు గాయమై అతను అక్కడికక్కడే మృతి చెందాడు. . ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# గ్రూప్ 1 ప్రిలిమ్స్ ప్రశాంతం

- 9 గంటలకే చేరుకున్న అభ్యర్థులు
- పరీక్ష కేంద్రాల వద్ద భారీ బందోబస్తు



గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు ఉదయం 9 గంటలకు చేరుకున్నారు. రాష్ట్రంలో 897 కేంద్రాల్లో మొత్తం 4.03 లక్షల మంది అభ్యర్థులు పరీక్ష హాజరవుతారని అధికారులు చెప్పారు. ఉదయం 10 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులను పరీక్ష కేంద్రాలకు అనుమతించ లేదు. బయోమెట్రిక్ హాజరు వేసుకుని అభ్యర్థులు పరీక్ష హాల్‌లోకి వెళ్లారు. పరీక్షా కేంద్రాల వద్ద సీసీకెమెరాల ఏర్పాటు చేశారు.

**897 పరీక్ష కేంద్రాలు ..**

ప్రతి 20 పరీక్షా కేంద్రాలకు ఒక రీజనల్ సెంటర్ చొప్పున ప్రాంతీయ సమన్వయకర్తలను నియమించిన సంగతి విదితమే.

మొత్తం 897 పరీక్షా కేంద్రాలలో చీఫ్ సూపరింటెండెంట్లు పర్యవేక్షించారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రవేశ ద్వారాల వద్ద, అలాగే పరీక్ష కేంద్రం కాంపౌండ్ వాల్ చుట్టూ పోలీసు పహారా ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతో అభ్యర్థులకు తోడుగా వచ్చిన సహాయకులు సహాయకులు కొంత దూరం వెళ్లి వేచి ఉన్నారు.

# వైఎస్సార్ విగ్రహాల ధ్వంసం

- షర్మిల ఫైర్

ఏపీలో వైఎస్సార్ విగ్రహాలపై జరుగుతున్న దాడులపై కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల స్పందించారు. అల్లరి మూకలు చేస్తున్న వికృత దాడులను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి అరాచకాలు జరగడం అత్యంత దారుణం, మిక్కిలి శోచనీయమని తెలిపారు. ఎటువంటి పరిస్థితుల్లోనూ ఇలాంటి రౌడీ చర్యలు ఖండించి తీరాల్సిందేనని, ఇది పిరికిపందల చర్య తప్ప మరోటి కాదని వైఎస్ షర్మిల అభిప్రాయపడ్డారు. తెలుగువాళ్ళ గుండెల్లో గూడుకట్టుకున్న వైఎస్సార్ విశేష ప్రజాదరణ పొందిన నాయకులు అని షర్మిల కొనియాడారు. తెలుగు ప్రజల హృదయాల్లో ఆయనది చెరపలేని ఒక జ్ఞాపకమని, అటువంటి నేతకు నీచ రాజకీయాలు ఆపాదించడం సరికాదన్నారు. గెలుపోటములు ఆపాదించడం తగదని, వైఎస్సార్ ను అవమాయించేలా ఉన్న ఈ హీనమైన చర్యలకు.. బాధ్యులైన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# పరుగులు పెట్టాల్సిందే



- అధికారులతో భట్టి సమీక్ష
- అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి
- అధికారులు అలసత్వం ప్రదర్శించొద్దు
- అండర్ డ్రైనేజీ రూ. 128 కోట్లు
- ఉప ముఖ్యమంత్రి భట్టి

ఎన్నికల కోడ్ ముగిసింది అధికారులు అభివృద్ధి పనుల వేగవంతం పెంచాలన్నారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. ఇది ప్రజా ప్రభుత్వమని, ప్రజలకు హామీలు ఇచ్చామన్నారు. అధికారుల జవాబుదారీ తనంతో పనిచేయాలని తెలిపారు.

ఖమ్మం జిల్లా మధిర క్యాంపు కార్యాలయంలో మధిర అభివృద్ధిపై నేడు అధికారులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మధిరలో అండర్ డ్రైనేజీ నిర్మాణం కోసం 128 కోట్ల రూపాయలు నిధులు విడుదల చేస్తూ జీవో జారీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అధికారులు అలసత్వం ప్రదర్శించకుండా , ప్రభుత్వ పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లాలన్నారు.. ఈ సమావేశానికి మున్సిపల్ చైర్ పర్సన్, కౌన్సిలర్లు , అధికారులు వివిధ రాజకీయ పార్టీ నేతలు హజరయ్యారు.



**ఆలోచించి అడుగులు వేయాలి**

# రాజకీయాల్లో దూకుడు అనర్థం

- కీలక వ్యక్తులకే పార్టీ అప్పగిస్తే మంచిది
- అయినోళ్లను దూరం చేసుకోవద్దు
- తనయుడికి విజయమ్మ ఓదార్పు

ఏపీలో హోరాహోరీ ఎన్నికల తరుణంలో అమెరికాకు వెళ్లిన వైసీపీ నేత వైఎస్ జగన్ తల్లి విజయమ్మ స్వదేశానికి తిరిగి వచ్చారు. హైదరాబాద్‌లో అడుగుపెట్టారు. మరుసటిరోజే తాడేపల్లిలోని తనయుడు జగన్ దగ్గరకు వచ్చారు. కొద్దిరోజులపాటు ఇక్కడే ఉండనున్నారు. ఈ సమయంలో జగన్‌కు తన తల్లి కీలక సలహాలు ఇచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. రాజకీయాల్లో దూకుడు ఉండకూడదని, ఆలోచించి అడుగులు వేయాలని సలహా ఇచ్చారట. కాకపోతే ఇప్పుడున్న సమస్యల నుంచి గట్టెక్కేందుకు ఆలోచన చేయాలని చెప్పారని సమాచారం. పార్టీ వ్యవహారాలను కీలకవ్యక్తులకు అప్పగిస్తే కొద్దిరోజులపాటు వాళ్లే నడిపిస్తారని, అయినవాళ్లను అక్కున చేర్చుకుంటే మంచి ఫలితాలు వస్తాయని జగన్ ను ఓదార్చినట్టు ప్రచారం జరుగుతోంది. గడిచిన ఎన్నికల్లో కుమార్తె వైఎస్ షర్మిలకు మద్దతుగా విజయమ్మ నిలిచారు. ఎన్నికల ప్రచారం ముగిసిన రోజు సాయంత్రం విజయమ్మ ఏపీ ఓటర్లకు వీడియో సందేశం ఇచ్చారు. కడప ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈసారి ఎన్నికల్లో షర్మిలను గెలిపించాలని అందులో పిలుపునిచ్చారు. తన కూతురికి కడప జిల్లా ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించాలని అందులో ప్రస్తావించారు.తాజాగా తన కుమారుడి స్థితిని చూసి తల్లడిల్లిన తల్లి సహజసిద్ధంగా ఓదార్చారని వైపీపీ శ్రేణులు అంటున్నారు.



## పోచమ్మ,మైసమ్మ, రామాలయ దేవాలయాలకు నూతన కమిటీ ఎన్నిక

**నూతన అధ్యక్షునిగా ఏకగ్రీవ ఎన్నికైన నాగిళ్ల బిక్షపతి**



మన సాక్షి గొంతుక /తెలంగాణ బ్యూరో

శంషాబాద్ మున్సిపల్ పరిధిలో నీ,ఎయిర్పోర్ట్ కాలనీ ఆదివారం ఉదయం , ఎయిర్పోర్ట్ కాలనీ లోని పోచమ్మ గుడి దేవాలయంలో సిద్దేశ్వర ఎయిర్పోర్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షులు సురేష్ గౌడ్ నిర్వహించిన,నూతనంగా దేవాలయాల కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. పోచమ్మ దేవాలయం శ్రీరాములు ఆలయం మైసమ్మ ఆలయంలో కు అధ్యక్షులుగా,నాగిళ్ల బిక్షపతి,ఎన్నుకోవడం జరిగింది,ఉప అధ్యక్షులు గా జెనిగా గోపాల్ యాదవ్,జనరల్ సెక్రటరీ: నానం వెంకటేష్,వర్కింగ్ ప్రెసిడెంట్: బొల్లు బాబూలాల్,జాయింట్ సెక్రటరీ: జెనిగా రాజు యాదవ్ జాయింట్ సెక్రెటరీ: బొల్లు శ్రీనివాస్,జాయింట్ సెక్రెటరీ: బబ్బురు సిద్దేశ్వర్ గౌడ్ జాయింట్ సెక్రెటరీ: శానమని సిద్ధులు ముదిరాజ్,ట్రెజరర్: సల్ల శ్రీనివాస్ ముదిరాజ్,ట్రెజరర్: బబ్బురు రామకృష్ణ గౌడ్, ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు కమిటీ సభ్యులు మాట్లాడుతూ, దేవాలయం అభివృద్ధికి మరియు హిందూ మతానికి అభివృద్ధి చెందడానికి పాటుపడుతామని మమ్ముల్ని దేవాలయాలకు కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నందుకు ఎయిర్పోర్ట్ కాలనీ అధ్యక్షులకు సురేష్ గౌడ్, కాలనీ పెద్దలకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేయుచున్నాము.

## ఘనంగా పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం




మన సాక్షి గొంతుక /యాదాద్రి/మోటకొండురు

ఎరా ఒరేయ్ అంటూ పలకరించుకునే చిన్ననాటి దోస్తులంతా 15 సంవత్సరాల తరువాత ఒకే చోట కలుసుకున్నారు, వారి కలయికకు ముత్తిరెడ్డిగూడెం గ్రామంలోనీ మానస విద్యా మందిర్ వేదిక అయింది. యాదాద్రి భువనగిరి భువనగిరి జిల్లా మోటకొండురు మండలంలోని ముత్తిరెడ్డిగూడెం గ్రామంలో మానస విద్యా మందిర్ ఉన్నత పాఠశాల 2009-2010 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు పాటశాల ఆవరణలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. మొదట పరిచయ కార్యక్రమంతో మొదలయిన కార్యక్రమం వారికి విద్య బుద్ధులు నేర్పిన గురువులను సన్మానించుకున్నారు, పాటశాల మొత్తం తిరుగుతూ ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటు సరదాగా గడిపారు, వివిధ రంగాల్లో స్థిర పడిన పూర్వ విద్యార్థులు అంత చాలా రోజులకు ఇలా కలుసుకోవడంతో వారు చాలా సంతోషంగా ఉందని అభిప్రాయపడ్డారు,అనంతరం జరిగిన కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మాజీ కరస్పాండెంట్ లు నిమ్మ శేఖర్ రెడ్డి,సామ భూపాల్ రెడ్డి సంయుక్తంగా మాట్లాడుతూ విద్యాభ్యాసం పూర్తి అయిన తరువాత ఎక్కడెక్కడో స్థిరపడిన విద్యార్థులంతా ఒక వేదికపైకి వచ్చి కలుసుకోవడం అభినందనీయం అన్నారు.అమ్మానాన్న తొలి గురువులైతే తర్వాత స్థానం ఓనమాలు నేర్పిన గురువులదే అన్నారు.ఈ కార్యక్రమంలో ఆనాటి గురువులు సామ నిర్మల, నిమ్మ లత,మదార్, వెంకటేష్ , శ్రీకాంత్, సంతోష్, పూర్వ విద్యార్థులు మణికాంత్ రెడ్డి, వెంకటేష్, దేవేందర్,మమత,అనూష , ఉపేందర్, సురేష్,మాధవి, శ్రీకాంత్,కీర్తి, మహేందర్ శృతి, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

# విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ , ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి





మన సాక్షి గొంతుగా ప్రతినిధి ఉప్పల్

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గారు మరియు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహావిష్కణ మల్లాపూర్ ఎలిఫేంట్ సర్కిల్ ,కాప్రా సర్కిల్ లో అరుంధతి సంక్షేమ సంగం అద్వర్యం లో ఎర్పాటు చేసిన విగ్రహ అవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ , గౌరవ ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి పాల్గొని విగ్రహాల ఆవిష్కరణ చేశారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ,ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ భారతదేశం, ప్రజలు, భవిష్యత్తు తరాలకోసం రాజ్యాంగ నిర్మాతగా సామాజిక న్యాయం కోసం పోరాడిన యోధుడిగా అంబేద్కర్ చేసిన కృషి, త్యాగం అజరామరం.వారి విగ్రహం ఏర్పాటు చేసుకోవడమంటే వారి అత్యున్నత ఆశయాలు భవిష్యత్ తరాలకు తెలియపర్చడమే.భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ పేరొందిన స్వాతంత్ర్య సమర యోధుడు,సంఘ సంస్కర్త, రాజకీయవేత్త, ఆనాటి సమాజంలో చదువుకు దూరమై దుర్భర జీవితాన్ని గడుపుతున్న.. పీడిత దళిత దీన జనుల కోసం శ్రమించిన సంస్కరణల యోధుడు అని తెలిపారు. ఆయన జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవా ల్సిన అవసరం ఎంతైనా ఉంది అని ఎమ్మెల్యే కొనియా డారు. ఈ కార్యక్రమం లో మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి , హౌసింగ్ బోర్డ్ కార్పొరేటర్ ప్రభుదాస్ , BRS పార్టీ గ్రేటర్ నాయకులు సాయి జెన్ శేఖర్,మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, శ్రీనివాస్ రెడ్డి గొల్లురి అంజయ్య, MRPS నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# టీఎస్ఎస్ఓ ఆధ్వర్యంలో ఉచిత ఫెర్టిలిటీ శిబిరం ప్రారంభం





**- శ్రీనివాస హాస్పిటల్ లో నిర్వహించిన ఉచిత ఫెర్టిలిటీ శిబిరాన్ని ప్రారంభించిన డాక్టర్ పంతంగి జ్యోతిష్మతి శర్మ**

**- ముఖ్యఅతిథిగా టీఎస్ఎస్ఓరాష్ట్ర అధ్యక్షులు లక్ష్మీనివాస్**

రాజేంద్ర నగర్ /జూన్ 09(మన సాక్షి గొంతుక )

శంషాబాద్ పట్టణంలో శ్రీనివాస హాస్పిటల్ లో నిర్వహించిన ఉచిత ఫెర్టిలిటీ శిబిరాన్ని ప్రారంభించిన డాక్టర్ పంతంగి జ్యోతిష్మతి శర్మ ఎం .బీ .బీ ఎస్ గోల్డ్ మెడలిస్ట్ & స్టేట్ టాపర్,టీఎస్ఎస్ఓరాష్ట్ర అధ్యక్షులు లక్ష్మీనివాస్ ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉచిత స్కాన్, ఉచిత పరీక్షలు, మందులు ఇవ్వడంతో పాటు ప్రతి ఒక్కరు తల్లి కావాలనుకున్నప్పటికీ దురదృష్టశవత్తు తల్లి కాలేనప్పుడు సమాజం వికక్షణం ఎదుర్కొంటు కృంగిపోవనవసరం లేదు ప్రస్తుతం సైన్స్ సాధించిన అపూర్వమైన ప్రగతి తో అలాంటి దంపతుల నుండి అండాన్ని వీర్యాన్ని సేకరించి ల్యాబ్లో ఫలదీకరణ చేసి టెస్ట్ పద్ధతి ద్వారా పిల్లలను పుట్టించడానికి అవసరమైన అన్ని సదుపాయాలు అందరికీ అందుబాటులో మన రాఘవేంద్ర ఫెర్టిలిటీ సెంటర్ లో ఉన్నాయి. వైద్య చికిత్స విధానంలో అపారమైన అనుభవం కలిగిన డాక్టర్ పి.జ్యోతిష్మతి శర్మ ఆధ్వర్యంలో నడుస్తున్న, రాఘవేంద్ర ఫెర్టిలిటీ సెంటర్లో ఇప్పటికే చాలామంది దంపతులు వైద్యం చేయించుకుని మాతృత్వాన్ని పొంది ఉన్నారు కావున సంతానం లేనివారు బాధపడుతున్న దంపతులు రాఘవేంద్ర ఫెర్టిలిటీ సెంటర్ కి వచ్చి తల్లిదండ్రులు కావాలనుకునే కలను నెరవేర్చుకోగలరని ఈ సందర్భంగా మాట్లాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో టీఎస్ఎస్ఓ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మీసాల వంశీ, సుదర్శన్ ,జానీ తదితరులు పాల్గొన్నారు.

# తండాల్లో అంతర్గత రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యం

**- ఎంపీపీ పిన్నింటి మధుసూదన్ రెడ్డి**

**- రూ.4 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభం..**



మన సాక్షి గొంతుక/కొత్తూరు ప్రతినిధి:-

మండలంలోని అన్ని తండాల్లో అంతర్గత రహదారుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని కొత్తూరు ఎంపీపీ పిన్నింటి మధుసూదన్ రెడ్డి అన్నారు. కొత్తూరు మండలంలోని వైఎం తండాలో శనివారం సీసీ రోడ్డు పనులను ఎంపీపీ పిన్నింటి మధుసూదన్ రెడ్డి శనివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణానికి ఎంపిపి నిధులు నుండి రూ.4 లక్షలతో మంజూరు చేయడం జరిగిందని తెలిపారు.పనులు సకాలంలో నాణ్యతతో చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ అరుణ రమేష్,మాజీ ఉపసర్పంచ్ లు దశరథ్ నాయక్,వాల్య నాయక్,ఎంపిటిసి పాత్లావత్ డాకీ,మాజీ ఎంపిటిసి మోడీ దర్శన్,జయేందర్ రెడ్డి,నరేందర్ రెడ్డి,రాజు గౌడ్,నరేందర్,రవి, హనుమంతు,కోఆప్షన్ మెంబర్ రాములు,నర్య నాయక్,నరేష్ నాయక్,బాలు, రాంచంధర్, తుల్చా, సేవ్య, తండావాసు లు తదితరులు పాల్గొన్నారు

# చిత్రకళలో తృతీయ బహుమతి సాధించిన ఇరుకుల్ల వీరేశం





**– మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా 20 వేల రూపాయల నగదు**

మన సాక్షి గొంతుక/ ఓదెల :

పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం జిలకుంట గ్రామానికి చెందిన గ్రామీణ యువ ఫోటోగ్రాఫర్ ఇరుకుల్ల వీరేశం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుండి ప్రతిష్టాత్మకమైన అవార్డు సాధించారు.రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మాదాపూర్ లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీ నిర్వహించిన అఖిల భారత చిత్రకళా పోటీలో ఇరుకుల్ల వీరేశం తీసిన ఛాయాచిత్రం తృతీయ బహుమతిని గెలుచుకుంది.2018లో ప్రారంభమైన ఆల్ ఇండియా ఆర్ట్ కాంపిటీషన్ అండ్ ఎగ్జిబిషన్ దేశంలోని సమకాలీన కళా పద్ధతులను అనుసంధానించడానికి ఈ సంస్థ ప్రతి ఏటా చిత్ర కళాకారులను గుర్తించి సన్మానిస్తోంది. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన 5వ ఎడిషన్ పోటీలో వీరేశం ఈ బహుమతి గెలుపొందారు.దేశవ్యాప్తంగా వివిధ నగరాల నుంచి 600 మంది చిత్రకారులు తాము తిసిన చిత్రాలను ఈ పోటీలకు పంపించగా యువ చిత్రకారుడు వీరేశం తీసిన ఫోటోకు తృతీయ స్థానం దక్కింది. శనివారం హైదరాబాదు లోని మాదాపూర్ లో అంగరంగ వైభవంగా నిర్వహించిన బహుమతుల ప్రధానోత్సవం కార్యక్రమంలో రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా వీరేశం 20 వేల రూపాయల నగదు తో పాటు ప్రశంసా పత్రాన్ని అందు కున్నారు.

ఈ సందర్భంగా బహుమతి విజేత వీరేశం మాట్లాడుతూ.... రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సందర్భంగా తాము తీసిన ఛాయాచిత్రానికి తృతీయ బహుమతి రావడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యువకళాకారులను ప్రోత్సహించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలన్నారు.

ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ కె. లక్ష్మి ఐఏఎస్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా నిర్వహించిన ఈ పోటీలో పాల్గొన్న కళాకారులు రూపొందించిన 162 ఉత్తమ చిత్రాలను మాదాపూర్ లోని ఆర్ట్ గ్యాలరీలో ప్రదర్శన కొరకు ఉంచినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ప్రథమ బహుమతి సాధించిన కర్ణాటక కు చెందిన చంద్రకాంత్ పాటిల్ మరియు దేశంలోని వివిధ చిత్రకారులతోపాటు హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షులు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్సీ నవీన్ రెడ్డిని సన్మానించిన బిఆర్ఎస్ నాయకులు వనం బాలరాజు,దామోదర్ రెడ్డి, దేశాల జైపాల్

మన సాక్షి గొంతుక/ కొత్తూరు ప్రతి నిధి:-

మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ ఎన్.నవీన్ కుమార్ రెడ్డిని కొత్తూరు మండలం పెంజర్ల గ్రామ మాజీ సర్పంచ్ వనం బాలరాజు,దామోదర్ రెడ్డి, దేశాల జైపాల్ సన్మానించారు. ఆయనతోపాటు మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ దేశాల భీమయ్య,బి.రాజు,మాజీ వార్డ్ సభ్యుడు కుమ్మరి పోచయ్య, తదితరులు ఉన్నారు. శాలువాతో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భవిష్యత్తులో రాజకీయంగా మరి ఎంతో అభివృద్ధి చెందాలని వారు ఆకాంక్షించారు.ఈ ప్రాంత అభివృద్ధికి తమ వంతు సహకారం అందించి ప్రజలకు సాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు కోఆర్డినేటర్ వనం శేఖర్, సంగుడ జంగయ్య,పలుగుట్ట చిన్న మల్లయ్య,రాములు తదితరులు పాల్గొన్నారు.

## మార్షల్ ఆర్ట్స్ తో ప్రాణ రక్షణ

**– మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్**

**– ఉత్తమ ప్రతిభ కనబరిచిన వరుణ్ సాయి,సాయి స్నేతిక్ లకు బ్లాక్ బెల్టులు అందజేసిన చైర్పర్సన్**




మన సాక్షి గొంతుక / కొత్తూరు ప్రతి నిధి:-

మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం వల్ల ఆపద సమయంలో ప్రాణాలను కాపాడుకోవచ్చని అని మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్ అన్నారు.కొత్తూరు మున్సిపాలిటీలో బోధి వర్మ కుంఫు కరాటే గ్రాండ్ మాస్టర్ నరసింహ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్ హాజరై విద్యార్థులకు వరుణ్ సాయి,సాయి స్నెతిక్ లకు బ్లాక్ బెల్ట్,కావ్య,దివ్య,శ్రీలకు బ్రౌన్ బెల్ట్,మెమోలు మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్ అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు తల్లిదండ్రులు కరాటేలో ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మాదారం నరసింహ గౌడ్, వేదవతి,తదితరులు పాల్గొన్నారు.





## పెంబర్తి గ్రామంలో ఘనంగా బీజేపీ నాయకుల సంబరాలు

**మోడీ మూడవ సారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం సందర్భంగా బాణాసంచా పేల్చి సంబరాలు**

మన సాక్షి గొంతుక ప్రతినిధి/జనగామ:

వికసిత్ భారత్ సంకల్ప లక్ష్యసాధనగా ముందుకు సాగుతూ సుపరిపాలన,అభివృద్ధి,పేదల సంక్షేమం కేంద్ర బిందువులుగా పాలన చేసి,ప్రజల మన్ననలు పొంది వరుసగా మూడోసారి ప్రధానిగా ప్రమాణస్వీకారం చేసిన నరేంద్ర మోదీ కి శుభాకాంక్షలు తెలియజేస్తూ బీజేపీ పెంబర్తి గ్రామశాఖ ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో గ్రామంలో బీజేపీ కి ఓటు శాతం పెరిగిందని,అదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో ఎన్నిక ఏదైనా బీజేపీ నాయకులు పోటీ ఇస్తారని గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతామని దానికి గ్రామస్తుల సహకారం ఉండాలని,గ్రామంలో సమస్యల సాధనే లక్ష్యంగా పనిచేస్తామని నిజాయితీగా పని చేసేది ఒక్క బీజేపీ కార్యకర్తలు మాత్రమే అని,యువత,మేధావులు,సామాజిక సేవకులను పార్టీ ఆహ్వానిస్తోందని అన్నారు.అందరి సహకారంతో పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ గ్రామ శాఖ అధ్యక్షులు బండ మల్లిఖార్జున్,బండ శ్రీను,శ్రీమన్నారాయణ,సీనియర్ నాయకులు బాలగాని శ్రీనివాస్,నర్సయ్య,బుడిగె శ్రీనివాస్,నాయకులు అంబాల వినయ్ కుమార్,గొలనుకొండ శ్రీనివాస్,ఆకుల శరత్,గుండా ఆంజనేయులు,బండ సత్తయ్య,బంగిమటం నాగభూషణం,నీర్మాలా భాస్కర్, అంబాల శివనాథ్,అయిల మాధవా చారి,భాస్కరా చారి,రాజు,సోమ నరసింహ చారి,అంబాల భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## కోటపల్లి లో బీజేపీ పార్టీ సంబరాలు

మన సాక్షి గొంతుక జూన్ 09 (చెన్నూర్)

కోటపల్లి మండల కేంద్రం లో బీజేపీ పార్టీ కేంద్రం లో గవర్నమెంట్ ఏర్పాటు చేసి నరేంద్ర మోడీ గారు ప్రధానమంత్రి గా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా దుర్గం అశోక్ అన్న ఆ ధ్వర్యం లో కొటపల్లి మండల కేంద్రంలో బీజేపీ శ్రేణులు సంబరాలు చేసుకొని బాణాసంచలు పేల్చడం జరిగినది. ఇందులో కోటపల్లి మండల బీజేపీ అధ్యక్షులు మంత్రి రామయ్య, మండల బీజేపీ పార్టీ ఇచార్జీ కాశెట్టి నాగేశ్వర్ రావు రాళ్ళబండి శ్యామ్ సుందర్, కందుల వెంకటేష్, శీగం చెంద్ర య్య,కాషెట్టి రాకేష్, ఇప్ప సత్యం, దునిగాల రాజన్న,బెల్లంపల్లి నారాయణ తదితరులు పాల్గొన్నారు.



## పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



మన సాక్షి గొంతుక ప్రతినిధి/లింఘాల ఘనపురం:

మండలంలోని కళ్లెం జడ్పీ ఉన్నత పాఠశాలలో 1994-95 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జనగామలోని ఓ వేడుకల మందిరంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి అందరు గురువులను ఆహ్వానించి వారి సమక్షంలో బాల్య జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.ఉన్నత స్థాయిలో ఉన్న విద్యార్థులను గురువులు అభినందించారు.పూర్వ విద్యార్థులు గురువులను శాలువాతో ఘనంగా సన్మానించారు.

# లయన్స్ సేవలు పెంచేందుకు అనుగుణంగా సభ్యుల సంఖ్య పెరగాలి



**మన సాక్షి గొంతుక ప్రతినిధి/జనగామ (జూన్ 9):**
సమాజంలోని అవసరార్థులను ఆదుకోవడానికి లయన్స్ క్లబ్బుల సేవా కార్యక్రమాలు పెంచేందుకు అనుగుణంగా లయన్స్ సభ్యుల సంఖ్య పెరగాలని 320ఎఫ్ జిల్లా గవర్నర్ లయన్ కుందూరు వెంకటరెడ్డి అన్నారు.ఆదివారము జనగామ లోని సాన్ మెరియా హైస్కూల్లో నిర్వహించిన రీజియన్ 6,7, 8 క్లబ్ సారధుల శిక్షణ శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించారు.రీజియన్ చైర్మన్ లు ఆర్.వెంకట్ రెడ్డి,కె.భాస్కర్ రెడ్డి,సి.హెచ్.రవీందర్ రెడ్డి ల
ఆద్వర్యంలో నిర్వహించిన ఈశిబిరంలో మహబూబబాద్, తొర్రూరు,పాలకుర్తి,జనగామ, చేర్యాల ప్రాంతాల నుండి లయన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న తక్షణ పూర్వ జిల్లా గవర్నర్ లయన్ కన్న పరశురాములు శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లబ్ సారధులైన అధ్యక్షులు,కార్యదర్శులు,కోశాధికారులుగా ఎన్నికైన లయన్ నాయకులకు అభినందనలు తెలిపారు.మీ సారధ్యంలో క్లబ్బు అభివృద్ధి సాధించేందుకు మీరు కృషి చేయాలని కోరారు.క్లబ్ అధ్యక్షుల బాధ్యతల గురించి పూర్వ జిల్లా గవర్నర్ లయన్ డా. డి.లవకుమార్ రెడ్డి,కార్యదర్శుల బాధ్యతల గురించి పూర్వ జిల్లా గవర్నర్ లయన్ తమ్మెర లక్ష్మీ నరసింహ రావు,కోశాధికారి బాధ్యతల గురించి తక్షణ పూర్వ జిల్లా గవర్నర్ లయన్ కన్న పరశు రాములు ఏక కాలములో విడి విడి గా బోధించారు.ఇంకా క్లబ్ రిపోర్ట్స్ గురించి జిల్లా అడ్మినిస్ట్రేటర్ చంద్రగిరి ప్రసాద్,మహిళాభ్యుదయం గురించి వి.శారద,లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సేవల గురించి సెకండ్ వైస్ జిల్లా గవర్నర్ నరహరి సుధాకర్ రెడ్డి,మీటింగు టైమ్ మీనేజ్ మెంట్ గురించి ఫస్ట్ వైస్ జిల్లా గవర్నర్ లయన్ డా. కె. చంద్రశేఖర్ ఆర్యా,సేవా కార్యక్రమాల గురించి జి.ఎస్. టి.కోఆర్డినేటర్ లయన్ ఆర్. రమణారెడ్డి తో పాటు జిల్లా క్యాబినేట్ కార్యదర్శి సయ్యద్ హాబీబ్,రీజియన్ చైర్మన్ లు సి. హెచ్.రవీందర్ రెడ్డి,కలువల భాస్కర్ రెడ్డి, ఆర్.వెంకట్ రెడ్డి లు ప్రసంగించారు.ఇంకా ఈ కార్యక్రమంలో జోన్ ఛైర్మన్ లు పి. జయహరి,ఆర్.ప్రవీణ్ కుమార్, శ్రీభాశ్యం రఘు,బజ్జూరి వేణుగోపాల్,రీజియన్ కార్యదర్శులు పి.వి.ప్రసాద్,కన్న శ్రీనివాస్,పి.వెంకట్ రెడ్డి,జిల్లా క్యాబినెట్ అదనపు కార్యదర్శి అనుమాల వేంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



## ఇంటింటికి ఇందూజ్ఞాన ధర్మ ప్రచారం

**మన సాక్షి గొంతుక ప్రతినిధి/జనగామ:**
జనగామ మండలంలోని సిద్దెంకి గ్రామంలో హిందూ జ్ఞాన వేదిక సభ్యులు ధర్మ ప్రచారాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా హిందూ జ్ఞాన వేదిక సభ్యులు మాట్లాడుతూ హిందూ జ్ఞాన ధర్మ ప్రధాత,సంచలనాత్మక రచయిత శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల స్వామి వారు రచించిన 100 ఆధ్యాత్మిక గ్రంథాలను మరియు త్రైత సిద్ధాంత భగవద్గీతను ఇంటింటికి పరిచయం చేసినట్లు తెలిపారు.భగవద్గీతలో శ్రీకృష్ణ భగవానుల వారు భక్తి యోగం 10వ శ్లోకంలో నా కొరకు పనులు చేయుము.నా కొరకు పనులు చేయుట వలన మోక్షాన్ని ఇస్తాను అన్నాడు.కాబట్టి శ్రీకృష్ణ పరమాత్ముని పని అయిన గీతా ధర్మ ప్రచారం చేస్తే ఆయన పని చేసినట్లు అవుతుందని మోక్షానికి దగ్గరగా వెళ్తామని తెలిపారు.కాబట్టి శ్రీకృష్ణ భగవానుడు తెలిపిన ఆ గీతాధర్మములను ప్రతి ఇంటికి చేరవేయవలసిన బాధ్యత ప్రతి జ్ఞాని అయిన హిందువుకు ఉంటుందని అందరూ ఈ కార్యక్రమంలో పాలుపంచుకొని దేవదేవుడైన శ్రీకృష్ణ పరమాత్మునిలోకి ఐక్యం కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో దేవేంద్ర,పంచక్షరి అశోక్,ఉపేందర్, శివరామకృష్ణ,లక్ష్మీనారాయణ, శంకర్,సాయి రాజు,యాదగిరి, లతా,మాధవి,సుకన్య పాల్గొన్నారు

## నేడు జిల్లా కలెక్టరేట్ లో ప్రజావాణి ఆర్జీల స్వీకరణ

**నేటి నుంచి ప్రజావాణి కార్యక్రమం పునః ప్రారంభం**

**మన సాక్షి గొంతుక ప్రతినిధి/జనగామ:**
అసెంబ్లీ,పార్లమెంట్ నియోజకవర్గాల ఎన్నికల నిర్వహణ లో భాగంగా ఎన్నికల కోడ్ ఉండటం వలన ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా నిలిపి వేయడం జరిగిందని,ఎన్నికలు పూర్తయినందున ప్రభుత్వం ఎన్నికల కోడ్ తొలగించడంతో నేడు సోమవారం ఉదయం 10:30 గంటల నుండి 1:00 మధ్యాహ్నం వరకు ప్రజావాణి కార్యక్రమం (గ్రీవెన్స్ డే) నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ తెలిపారు.ప్రజలు తమ సమస్యల పరిష్కారం కొరకు దరఖాస్తులు అందించేందుకు ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగించుకోవాల్సిందిగా కలెక్టర్ కోరారు.



## గ్రూప్-1 పరీక్ష కేంద్రాలను సందర్శించి పరిశీలించిన జిల్లా కలెక్టర్



**మన సాక్షి గొంతుక ప్రతినిధి/జనగామ:**
గ్రూప్-1 పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఆదివారం సంబంధిత అధికారులతో కలిసి సందర్శించి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గ్రూప్ -1పరీక్షలు వ్రాసేందుకు 3697 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, అందులో పురుషులు 2244 మంది, స్త్రీలు1453 మంది ఉన్నట్లు తెలియజేశారు.పరీక్షకు హాజరైన అభ్యర్థులు పురుషులు 1806 మంది ఉండగా,స్త్రీలు 1143 మంది ఉన్నారని మొత్తం 2949 మంది పరీక్షలు రాయగా79.77 శాతం నమోదైనట్లు కలెక్టర్ కు వివరించారు.అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ గ్రూప్-1 పరీక్షల నిర్వహణలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని,పరీక్షలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.కలెక్టర్ వెంట జనగామ ఆర్డీవో కొమరయ్య, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.




ఈనాడు గ్రూప్ సంస్థల చైర్మన్ రామోజీరావు గారు శనివారం రోజున తెల్లవారుజామున స్వర్గస్తులైన విషయం విధితమే.వారి ఆత్మకు శాంతి కలగాలని జనగామ జిల్లా ప్రింట్ మీడియా అసోసియేషన్,పేపర్ ఏజెంట్స్ ఆధ్వర్యంలో రామోజీరావు గారికి శ్రద్ధాంజలి ఘటించడం జరిగింది.అధ్యక్షుడు తాడూరి సంతోష్ రాజు,విశ్వనాథ్,యాకేష్,లక్ష్మణ్,గన్ను కార్తిక్,శివాజీ,ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

**మన సాక్షి గొంతుక ప్రతినిధి/జనగామ:**

## జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన టిఆర్ఎస్ సీనియర్ నాయకులు టి నరసింహులు...

**మన సాక్షి గొంతుక ప్రతినిధి/కూకట్పల్లి:**
టిఆర్ఎస్ నాయకులు పరమేష్ గౌడ్ పుట్టినరోజు సందర్భంగా జన్మదిన ఆ పార్టీ సీనియర్ నాయకులు టి.నర్సింహులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.తన పుట్టినరోజు శుభ సందర్బంగా భవిష్యత్ లో ఉన్నత పదవులు అందుకోవాలని కాంక్షించారు ఈ కార్యక్రమంలో హనుమాన్ నగర్ కాలనీ ప్రధాన కార్యదర్శి విట్టల్,ఎర్రన్న,కాసింయాదవ్,టైల్స్ శ్రీను,శంకర్ సింగ్,వెంకట్ యాదవ్,మల్లేష్ యాదవ్,కోటేశ్వరరావు,రామ్ రెడ్డి.
,అప్పారావు,అరుణ్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.



జనగామ జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా మెరుగు దేవరాజ్ ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.సెక్రటరీగా యంసని కృష్ణ ని,ట్రెజరర్ గా



దోర్నాల వెంకటేశ్వర్లు ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో వివిధ మండల అధ్యక్షులు,సెక్రటరీలు కోశాధికారులు ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ పాల్గొనడం జరిగింది.

**మన సాక్షి గొంతుక ప్రతినిధి/జనగామ:**

# పాకిస్థాన్‌పై భారత్ ఉత్కంఠ విజయం

**మూడు వికెట్లతో బుమ్రా విజృంభణ..**
**బాబర్ సేనకు వరుసగా రెండో ఓటమి**
**రాణించిన పాక్ బౌలర్లు**
**భారత్ 119 ఆలౌట్**



*ప్రతిష్ఠాత్మక టీ20 ప్రపంచకప్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై భారత్ అద్భుత విజయాల ప్రస్థానం దిగ్విజయంగా కొనసాగుతున్నది. వేదిక ఏదైనా విజయం మనదే అన్న రీతిలో టీమ్‌ఇండియా మువ్వెన్నెల పతాకాన్ని సగర్వంగా రెపరెపలాడించింది. అగ్రరాజ్యం అమెరికా గడ్డపై దాయాదిని మట్టికరిపిస్తూ తమ విజయాల రికార్డును మరో మెట్టు ఎక్కించింది. తొలుత పాక్ పేసర్ల ప్రతాపానికి బ్యాటర్లు కుదేలైన వేళ.. భారత్ 119 పరుగులకే కుప్పకూలింది. రిషబ్ పంత్(42) ఒంటరిపోరాటం జట్టుకు పోరాడే స్కోరు కట్టబెట్టింది. బ్యాటర్లు విఫలమైన చోట మన బౌలర్లు విశ్వరూపం ప్రదర్శించారు. బుమ్రా సూపర్ స్పెల్‌తో జట్టుకు చారిత్రక విజయాన్ని కట్టబెట్టాడు.*

**న్యూయార్క్:** ఇది కదా మ్యాచ్ అంటే! టీ20లలో బ్యాటర్ల రొడ్డకొట్టుడు బాదుడు కంటే 'లో స్కోరింగ్ థ్రిల్లర్'లో ఉండే మజాను భారత్-పాక్ మ్యాచ్ మరోసారి అందించింది. చివరి బంతి దాకా ఇరు జట్ల మధ్య నువ్వా నేనా అంటూ దోబూచులాడిన విజయం ఆఖరికి భారత్‌ను వరించింది. ఆదివారం న్యూయార్క్ లోని నసావు స్టేడియం వేదికగా పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో రోహిత్ సేన 6 వికెట్ల తేడాతో అత్యద్భుత విజయం అందుకుంది. పాక్ చతుర్దయం నసీమ్ షా (3/21), హరీస్ రవూఫ్ (3/21), మహ్మద్ అమిర్ (2/23), షహీన్ అఫ్రిది (1/29) నిప్పులు చెరగడంతో టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన భారత్.. 19 ఓవర్లలో 119 పరుగులకే ఆలౌట్ అయింది. రిషభ్ పంత్ (31 బంతుల్లో 42, 6 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా అక్షర్ పటేల్ (20) గుడ్డిలో మెల్లలా ఫర్వాలేదనిపించాడు. భారత బ్యాటర్లలో కోహ్లితో సహా ఏకంగా ఎనిమిది మంది 'సింగిల్ డిజిట్'కే పరిమితమయ్యారు. బ్యాటర్లు విఫలమైనా బౌలర్లు సమిష్టిగా రాణించడంతో పాకిస్థాన్.. నిర్ణీత 20 ఓవర్లలో 113/7కే పరిమితమైంది. రిజ్వాన్ (44 బంతుల్లో 31, 1 ఫోర్, 1 సిక్సర్) రాణించినా మిగిలిన బ్యాటర్లు ఒత్తిడికి చిత్తయ్యారు. భారత విజయంలో కీలక పాత్ర పోషించిన బుమ్రా (3/14)కే 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది.

**వచ్చారు.. వెళ్లారు..**

కీలక మ్యాచ్‌లో భారత బ్యాటింగ్ ఆర్డర్ దారుణాతి దారుణంగా విఫలమైంది. రోహిత్ (13), కోహ్లి (4), సూర్యకుమార్ (7), శివమ్ దూబె (3), హార్దిక్ పాండ్యా (7), రవీంద్ర జడేజా (0) అలా వచ్చి ఇలా వెళ్లారు. ఇన్నింగ్స్ మూడో బంతినే భారీ సిక్సర్‌గా మలిచిన రోహిత్, ఎదుర్కొన్న తొలి బంతినే బౌండరీగా మలిచిన కోహ్లి ఆరు బంతుల వ్యవధిలో పెవలియన్ చేరారు. కోహ్లిని నసీమ్ షా ఔట్ చేయగా రోహిత్‌ను షహీన్ పెవిలియన్‌కు పంపాడు. ఈ క్రమంలో భారత్.. పంత్‌కు జోడీగా అక్షర్‌ను పంపింది. ఈ జోడీ పాక్ పేస్ బౌలర్లను అడ్డుకున్నా వేగంగా పరుగులు రాబట్టలేకపోయింది. మూడో వికెట్‌కు 39 పరుగులు జోడించిన ఈ జంటను 8వ ఓవర్లో అమిర్ విడదీయడంతో వికెట్ల పతనం వేగం పుంజుకుంది. ఆ తర్వాత వచ్చినోళ్లలో ఒక్కరు కూడా రెండంకెల స్కోరు కూడా చేయలేకపోయారు. భారత అభిమానులు గంపెడాశలు పెట్టుకున్న సూర్యకు హరీస్ రవూఫ్ చెక్ పెట్టగా దూబె నసీమ్ షాకే రిటర్న్ క్యాచ్ ఇచ్చాడు. అమిర్ 15వ ఓవర్ వరుస బంతుల్లో పంత్, జడేజాను ఔట్ చేశాడు. అర్ష్‌దీప్ (9), సిరాజ్ (7 నాటౌట్) పుణ్యమా అని భారత్ మూడంకెల మార్కును దాటగలిగింది. భారత ఇన్నింగ్స్ మొదటి 10 ఓవర్లలో 3 వికెట్లకు 81 పరుగులు చేస్తే తర్వాతి 9 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 38 పరుగులే చేయగలిగింది.

**రిజ్వాన్ ఒక్కడే..**

స్వల్ప ఛేదనలో పాకిస్థాన్ సైతం తడబడింది. బాబర్ ఆజమ్ (13), ఉస్మాన్ ఖాన్ (13), ఫకర్ జమాన్ (13) విఫలమైనా రిజ్వాన్ పాక్‌ను గెలుపు దిశగా నడిపించాడు. సహచరుల అండతో విజయం దిశగా సాగుతున్న పాక్‌ను బుమ్రా దెబ్బకొట్టాడు. 15వ ఓవర్లో రిజ్వాన్‌ను క్లీన్‌బౌల్డ్ చేసి భారత్‌ను పోటీలోకి తెచ్చాడు. అప్పటికీ ఆజట్టు విజయానికి 4 ఓవర్లలో 36 పరుగులు కావాలి. కానీ తర్వాతి వరుస ఓవర్లలో అక్షర్ 2 పరుగులే ఇవ్వగా.. షాదాబ్ (4)ను ఔట్ చేసిన హార్దిక్ 5 రన్స్ ఇచ్చాడు. 18వ ఓవర్లో సిరాజ్ 9 పరుగులిచ్చాడు. బుమ్రా 19వ ఓవర్లో 3 పరుగులే ఇచ్చి కీలక ఇఫ్తికార్ (5) వికెట్ తీశాడు.

**ఆఖరి ఓవర్ సాగిందిలా..**

చివరి ఓవర్‌లో పాక్ గెలుపునకు 18 పరుగులు కావాల్సి ఉండగా.. అర్ష్‌దీప్ తొలి బంతికి ఇమాద్ వసీం (15)ను ఔట్ చేశాడు. 2,3 బంతుల్లో రెండు పరుగులు రాగా 4,5 బంతుల్లో నసీమ్ షా రెండు బౌండరీలు సాధించినా అప్పటికీ ఆ జట్టు విజయానికి 1 బంతికి 8 పరుగులు అవసరం ఉండటంతో పాక్ ఓటమి ఖరారైంది.

**సంక్షిప్త స్కోర్లు:**

**భారత్: 19 ఓవర్లలో 119 ఆలౌట్ (పంత్ 42, అక్షర్ 20, నసీమ్ 3/21, హరీస్ 3/21).**

**పాకిస్థాన్: 20 ఓవర్లలో 113/7 (రిజ్వాన్ 31, ఇమాద్ 15, బుమ్రా 3/14, హార్దిక్ 2/24)**

## అన్ లిమిటెడ్ అందాలు



లోఫర్ బ్యూటీ దిశా పటానీ చాలా కాలం తర్వాత టాలీవుడ్ లో తిరిగి అడుగుపెడుతోంది. ప్రభాస్ కల్కి 2898 AD చిత్రంలో దిశా పటానీ ఛమక్కులను వీక్షించేందుకు అభిమానులు చాలా ఆత్రుతగా వేచి చూస్తున్నారు. ఇంతకుముందే ఆన్ లొకేషన్ ప్రభాస్ తో దిశా ఎంతో సన్నిహితంగా ఉన్న ఫోటోలు, వీడియోలు వైరల్ అయ్యాయి. ఇక టాలీవుడ్ తో పాటు కోలీవుడ్ లోను దిశా ఎంట్రీ ఇస్తోంది. అక్కడ సూర్య పాన్ ఇండియన్ సినిమా 'కంగువ'లో దిశా స్పెషల్ అప్పియరెన్స్ అంతే ఛమక్కులా మైమరిపిస్తుందని భావిస్తున్నారు. తాజాగా దిశా పటానీ సమ్మర్ లుక్ వైరల్ గా మారింది. ఇది బీచ్ వెకేషన్.. బోట్ షికార్‌లతో ఫుల్ గా చిల్ అవుతోంది పటానీ. ఈ సందర్భంగా స్పెషల్ ఫోటోషూట్ తో అలరించింది. ఒక ఫోటోగ్రాఫ్ లో అంతగా బరువు లేని సింపుల్ ఫ్రాకులో దిశా అందంగా కనిపించింది. దిశా తన తలను పక్కకు తిప్పి మిర్రర్ లో వీక్షిస్తూ అందంగా నవ్వుకుంటోంది. మరో ఫోటోలో దిశా చిట్టి పొట్టి నిక్కరులో ప్రత్యక్షమైంది. బ్లూడెనిమ్స్ షార్ట్, పైన రెడ్ టాప్ తో ఎంతో హాట్‌గా కనిపిస్తోంది. ఇదే ఫోటోషూట్ లో స్నేహితురాలితో కలిసి బోట్ షికార్ చేస్తూ సందడిగాను కనిపిస్తున్న వీడియోని దిశా పటానీ షేర్ చేసింది.

## ఆ ఇల్లు రూ.14 కోట్లేనట

సందీప్ వంగా 'యానిమల్' చాలామంది ఫేట్ మార్చేసింది. రణబీర్ కపూర్ ని పాన్ ఇండియన్ స్టార్ గా నిలబెట్టిన ఈ చిత్రం అంతగా ఫేమ్ లేని బాబి డియోల్ రేంజును అమాంతం స్కైలోకి చేర్చింది. అతడు వరుస చిత్రాలతో బిజీ బిజీ అయ్యాడు. అలాగే యానిమల్ లో నటించింది కొద్దిసేపే అయినా కానీ, త్రిప్తి దిమ్రీ ఫేట్ ఇప్పుడు అమాంతం మారిపోయింది. త్రిప్తి నేషనల్ క్రష్‌గా ఎదిగింది. త్రిప్తీ వరుసగా సీక్వెల్ సినిమాల్లో కథానాయికలను రీప్లేస్ చేస్తోంది. 'ఆషిఖి 3' సహా పలు చిత్రాల్లో త్రిప్తి అవకాశాలు అందుకుంది. వరుసగా అడ్వాన్సులు అందుకుంటున్న త్రిప్తి దిమ్రీ ఇటీవల ముంబై బాంద్రాలో ఒక ఖరీదైన బంగ్లాను సొంతం చేసుకుంది. బాంద్రా వెస్ట్ ఏరియాలోని కార్టర్ రోడ్ లో గ్రౌండ్ ప్లస్ రెండు అంతస్తుల బంగ్లా కోసం రూ. 14 కోట్లు ఖర్చు చేసినట్లు సమాచారం. ఒక్క స్టాంప్ డ్యూటీకే రూ.70 లక్షలు ఖర్చయింది. ఆస్తి 2226 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంది. జూన్ 3న రిజిస్ట్రేషన్ జరిగింది. సెడ్రిక్ పీటర్ ఫెర్నాండెజ్ మార్గరెట్ అన్నీ మేరీ ఫెర్నాండెజ్ నుండి ఆస్తిని కొనుగోలు చేసిందని కథనాలొస్తున్నాయి.



హీరోయిన్ మృణాల్ ఠాకూర్.. సీతారామం మూవీతో ఓవర్ నైట్ స్టార్ గా మారిన విషయం తెలిసిందే. హను రాఘవపూడి దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం.. 2022లో రిలీజ్ అయ్యి బ్లాక్ బస్టర్ హిట్ అయింది. ఈ మూవీతోనే టాలీవుడ్ ఆడియన్స్ కు పరిచయం అయిన మృణాల్.. తొలి సినిమాలో తన అందం, అభినయంతో అందరినీ కట్టిపడేసింది. సీతామహాలక్ష్మీగా అందరి మనసుల్లో నిలిచిపోయింది. తెలుగులో ఫస్ట్ మూవీతో విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకుంది. ఇండస్ట్రీలో ఓ రేంజ్ లో క్రేజ్ కూడా దక్కించుకుంది. వరుస అవకాశాలు వచ్చినా.. ఆచితూచి అడుగులు వేసింది. సీతారామం తర్వాత.. నేచురల్ స్టార్ నానితో కలిసి హాయ్ నాన్నలో యాక్ట్ చేసింది. ఆ సినిమాతో మరో హిట్ ను తన ఖాతాలో వేసుకుని.. తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరయింది. ఇక రీసెంట్ గా ఫ్యామిలీ స్టార్ మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ టైమ్ లో ట్రైలర్ అంటే.. పెద్ద ఛాలెంజే.. కానీ ఫ్యామిలీ స్టార్ సినిమా.. బాక్సాఫీస్ వద్ద అనుకున్నంత స్థాయిలో మెప్పించ లేకపోయింది. అయితే సినిమాలో యాక్టింగ్ తో మృణాల్ మాత్రం మెప్పించింది. ఇటు టాలీవుడ్.. అటు బాలీవుడ్ లో వరుస అవకాశాలు అందుకుంటున్నట్లు టాక్ వస్తోంది. కానీ ఎలాంటి అనౌన్స్మెంట్ ఇప్పటి వరకు రాలేదు. చిరంజీవి విశ్వంభరతో పాటు ప్రభాస్ కల్కి చిత్రాల్లో స్పెషల్ రోల్స్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే సోషల్


## మహారాణిలా మృణాల్

Mrunal Thakur

మీడియాలో కూడా ఎప్పుడూ యాక్టివ్ గా ఉంటోంది మృణాల్ ఠాకూర్. రకరకాల ఔట్ ఫిట్స్ తో ఫోటోస్ దిగి పోస్ట్ చేస్తుంటోంది. తాజాగా ట్రెడిషనల్ ఔట్ ఫిట్ లో సందడి చేసింది అమ్మడు. మెరూన్ కలర్ లెహంగాలో మెరిసిపోయింది. కంప్లీట్ ఎంబ్రాయిడరీతో డిజైన్ చేసి ఉన్న లెహంగాలో యువరాణిలా ఫిదా చేస్తోంది. తన నవ్వుతో అందరినీ మాయ చేస్తోంది. ఝుంకాలు.. తలకు మల్లె పూలు.. చిన్న బొట్టు.. ఆమెను మరింత అందంగా మార్చాయి. ఎద అందాలతో కూడా కవ్విస్తోంది. ప్రస్తుతం మృణాల్ నయా పిక్.. సోషల్ మీడియాలో ఫుల్ వైరల్ అవుతోంది. అమ్మడు గ్లామర్ కు ఫ్లాట్ అయ్యామని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. సో నైస్ బ్యూటీ.. అంటూ సందడి చేస్తున్నారు. అందానికి పర్యాయ పదం అంటూ ఆకాశానికెత్తేస్తున్నారు.



Priyanka Mohan



## చికెన్ ఉంటే చాలు

హీరోయిన్లు అంతా పుడ్ విషయంలో ఎంత ఓపెన్ గా ఉంటారో చెప్పాల్సిన పనిలేదు. అందులోనూ నాన్ వెజ్ హీరోయిన్లు అయితే హైదరాబాద్ బిర్యానీ గురించి ఎంతో ప్రత్యేకంగా చెబుతారు. భాగ్యనగరంలోని అన్ని రకాల నాన్ వెజ్ రుచుల్ని ఆస్వాదించిన భామలెంతో మంది. తాజాగా ఆ జాబితాలో ప్రియాంక మోహన్ కూడా చేరిపోయింది. హైదరాబాద్ లో ఉంటే వారంలో రెండు రోజులు ఇక్కడ రుచులే ఆస్వాదిస్తుందిట. నాన్ వెజ్ లో ఏ వంటకం వదిలిపెట్టకుండా ఆస్వాదిస్తుందిట. ఏడాదిలో డైట్ కి అంటూ కొన్ని రోజులు కేటాయించుకుని మిగతా రోజులు మాత్రం ముద్ద లేనిదే ముక్క దిగదంటోంది. అంతే కాదు ఇంట్లో నాన్ వెజ్ వంటకాలు చేయడంలో తానో స్పెషలిస్ట్ అట. ఇంటికి చికెన్ తీసుకొస్తేమాత్రం కిచెన్ నాదే అంటోంది. ఆరోజు మాత్రం నాన్ వెజ్ వంటకాలన్ని స్వయంగా తయారు చేసి తల్లిదండ్రులకు పెడుతుందిట. ఇలా పేరెంట్స్ కి వండి పెట్టడంతో ఎంతో తృప్తి కలుగుతుందని తెలిపింది. . ఇక టాలీవుడ్ లో ప్రియాంక మోహన్ జర్నీ గురించి తెలిసిందే. నాని `గ్యాంగ్ లీడర్` సినిమాతో అమ్మడు తెలుగు తెరకు పరిచయమైన సంగతి తెలిసిందే. అటుపై శ్రీకరం అనే సినిమాలో నటించింది. ఈ రెండు సినిమాలు కూడా పెద్దగా ఆడలేదు. దీంతో ప్రియాంక కొన్నాళ్లు తమిళ్ సినిమాలే చేసింది. ప్రస్తుతం నానితోనే మళ్లీ సరిపోదా శనివారం అనే సినిమా చేస్తోంది. తమిళ్ లో బ్రదర్ అనే సినిమా చేస్తోంది.